నమస్తే తెలంగాణ

# సిద్దిపేట

13 | హైదరాబాద్, గురువారం 28 మార్చి 2024 | SIDDIPET

## నిండు మనస్సుతో ఆశీర్వదించండి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీశ్‌రావు, పక్కన మెదక్ ఎంపీ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

- బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి

సిద్దిపేట, మార్చి 27: నిండు మనస్సుతో ఆశీర్వదించండి... మీలో ఒకరినై సేవకుడిగా పని చేస్తానని మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డి అన్నారు. బుధవారం సిద్దిపేటలో పార్టీ శ్రేణుల సమావేశంలో మాజీ మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్సీ ఫరూఖ్ హుస్సేన్‌తో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వెంకట్రామారెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యల మీద లోతైన అవగాహన ఉందని, మెరుగైన పనితీరుతోనే ఇక్కడే పీడీగా, జాయింట్ కలెక్టర్‌గా, కలెక్టర్‌గా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులతో పని చేశానన్నారు. మెదక్ పార్లమెంట్ స్థానంలో ప్రతిసారి బీఆర్ఎస్ జెండా ఎగురుతూ వచ్చిందని, ఈ ప్రాంతంలో సుశిక్షితులైన, కరుడుగట్టిన నిస్వార్థమైన బీఆర్ఎస్ కార్యకర్తలు ఉండటం నా అదృష్టం అన్నారు. రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినా మెదక్ పార్లమెంటు పరిధిలో గులాబీ హవా కొనసాగిందన్నారు. తెలంగాణకు బీఆర్ఎస్, కేసీఆర్ నాయకత్వమే శ్రీరామ రక్ష అన్నారు. ఆస్తులు, అంతస్తుల కోసం రాజకీయాల్లోకి రాలేదని, కలెక్టర్ ఉద్యోగానికి రాజీనామా చేసి పూర్తిస్థాయిలో ప్రజాసేవ చేయడానికి వచ్చానన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంలో దీక్షాదక్షత కలిగిన కేసీఆర్, హరీశ్‌రావు పర్యవేక్షణలో పనిచేయడం వల్లనే ఒక అధికారిగా ప్రజల మన్ననలు పొందగలిగానని చెప్పారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ ఎంపీ ఎన్నికల సన్నాహక సమావేశం శుక్రవారం మధ్యాహ్నం 12గంటలకు సిద్దిపేటలోని కొండమల్లయ్య గార్డెన్‌లో 3వేల మందితో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మహిళలు, విద్యార్థులు, యువత ఇతర గ్రామస్థాయి అనుబంధ కమిటీల అధ్యక్ష కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## ఎన్నికల ఏర్పాట్లు పూర్తి చేయాలి

- అధికారులందరూ సమన్వయంతో పనిచేయాలి
- మెదక్, సంగారెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులు, కలెక్టర్లు



మాట్లాడుతున్న మెదక్ ఎన్నికల అధికారి రాహుల్‌రాజ్, పక్కన సంగారెడ్డి కలెక్టర్

సంగారెడ్డి కలెక్టరేట్, మార్చి 27: మెదక్ పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లు సజావుగా పూర్తి చేయాలని మెదక్, సంగారెడ్డి జిల్లాల ఎన్నికల అధికారులు రాహుల్ రాజ్, వల్లూరు క్రాంతి అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో ఎన్నికల నిర్వహణ అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించాలని, బీఎల్వోలు వీఐపీ ఓటర్ల జాబితా పరిశీలించి, రెండుచోట్ల నమోదైన వీఐపీ పేర్లను ఒకచోట తొలిగించాలని, సెక్టోరల్ అధికారులు, బీఎల్వోలు, తహసీల్దార్లు, ఏఆర్వోలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. అతిపెద్ద నియోజకవర్గం పటాన్‌చెరు పరిధిలోని 5 మండలాల్లో 391 పోలింగ్ కేంద్రాలు, 20 ఎగ్జిల్లరీ పోలింగ్ కేంద్రాలు, సంగారెడ్డి నియోజకవర్గంలో 281 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్టు వెల్లడించారు. 85 ఏండ్లు వయస్సు ఉన్న వారికి ఇంటి వద్దనే ఓటువేసే సౌకర్యం కల్పిస్తున్నట్టు వారు పేర్కొన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి, డీఆర్వో, ఏఆర్వోలు, తహసీల్దార్లు, నోడల్, సెక్టోరల్ అధికారులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ వచ్చి కరువు తెచ్చింది

### ప్రభుత్వం స్పందించి పంట నష్టపరిహారం ఇవ్వాలి

- పంటలకు సాగునీళ్లిచ్చి రైతులను ఆదుకోవాలి
- రుణమాఫీని ప్రభుత్వం వెంటనే అమలు చేయాలి
- బీఆర్ఎస్ కరీంనగర్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్



అకాల వర్షంతో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలిస్తున్న కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్, పక్కన మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, నాయకులు

బెజ్జంకి, మార్చి 27: కాంగ్రెస్ ప్రభుత్వం అనాలోచిత విధానాల వల్లే రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని, ప్రభుత్వ తీరు వల్లే కరువు సంభవించిందని కరీంనగర్ బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి బోయినిపల్లి వినోద్‌కుమార్ అన్నారు. బుధవారం సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని లక్ష్మీపూర్ గ్రామంలో మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌తో కలిసి అకాల వర్షంతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేసీఆర్ పాలనలో చెరువులు, కుంటలు నింపడంతో పుట్లకొద్దీ పంట పండిందని లక్ష్మీపూర్ గ్రామ మహిళా రైతు పద్మ చెప్పుతుంటే సంతోషం అనిపించింది. కానీ నేటి కాంగ్రెస్ పాలనలో పరిస్థితి చూస్తుంటే గుండె తరుక్కపోతుందన్నారు. మిడ్‌మానేరులో 16 టీఎంసీల సాగు నీళ్లు ఉన్నా బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు నీళ్లు ఇవ్వకుండా రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం తీవ్రంగా నష్టం చేసిందన్నారు. 2 టీఎంసీలతో చెరువులు, కుంటలు నింపితే రైతులు పంటలు పండించుకొని అభివృద్ధి చెందేవారన్నారు. బీఆర్ఎస్ పాలనలో మిడ్‌మానేరు నీటితో ఎర్రటి ఎండల్లో సైతం చెరువులు, కుంటలు నింపడంతో భూమికి బరువయ్యే పంటలు పండించి రైతులు ఆర్థికాభివృద్ధి సాధించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డ ప్రాజెక్టుకు మరమ్మతులు చేపట్టి సాగునీళ్లు అందించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రజా సమస్యలు పట్టించుకోకపోవడం దురదృష్టకరమని, పంట రుణాలు తెచ్చుకున్న రైతులను బ్యాంకర్లు వేధిస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. తెలంగాణ ఉద్యమంలో ఉన్న బాధలు కాంగ్రెస్ పాలనలో మళ్లీ ప్రజలు ఎదుర్కోవడం బాధాకరమన్నారు. తెలంగాణలో పదేండ్ల తర్వాత మళ్లీ మోటర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు కాలే పరిస్థితి వచ్చిందని, గ్రామాల్లోని మోటర్ వైండింగ్ దుకాణాల వద్ద రైతులు మరమ్మతుల కోసం క్యూకట్టే పరిస్థితి వచ్చిందన్నారు. ప్రజాసమస్యల కోసం పోరాటం చేసే ఏకైక పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నిలబెట్టుకునేలా పోరాటం చేద్దామని, ఎవరు కూడా ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఒకవైపు రైతులు వేసిన పంటలు ఎండడంతోపాటు అకాలవర్షంతో పంటలు పూర్తిగా దెబ్బతిన్నా ప్రభుత్వం ఆదుకునేందుకు చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. రుణాలు చెల్లించకుంటే ఆస్తులు జప్తు చేస్తామని బ్యాంకు అధికారులు రైతులను వేధిస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు అప్పులు చెల్లిస్తామని హామీతో కూడిన జీవోను బ్యాంకులకు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. మిడ్‌మానేరు నుంచి రెండు టీఎంసీల సాగునీటిని బెజ్జంకి, ఇల్లంతకుంట మండలాలకు అందించి మిగిలిన పంటను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ప్రజలను మాయ చేసి కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిందని మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ అన్నారు. మండలంలో చాలా ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఎంపీ బండి సంజయ్‌కుమార్ కనీసం పరిశీలించకపోవడం బాధాకరమన్నారు. ప్రజలు, రైతుల పక్షాన బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని, సమస్యలపై రాజీలేని పోరాటం చేస్తుందన్నారు. వారి వెంట పార్టీ మండలాధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి, నాయకులు లక్ష్మణ్, శ్రీనివాస్‌గుప్తా, శ్రీనివాసరావు, తిరుపతిరెడ్డి, రాజయ్య, శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి తదితరులున్నారు.



మెదక్ జిల్లా నార్సింగి మండలం నర్సంపల్లి పెద్దతండాలో ఎండిపోయిన వరిపొలాన్ని పరిశీలిస్తున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు

## ప్రాజెక్టు గేట్లు తెరిచి పంటలకు నీరందించాలి

### కాంగ్రెస్‌తోనే తెలంగాణలో కరువు వచ్చింది

- మెదక్ జిల్లా నార్సింగి మండలంలో ఎండిపోయిన పంటల పరిశీలన
- పంట నష్టపోయిన రైతులకు రూ.20వేల పరిహారం చెల్లించి ఆదుకోవాలి
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

చేగుంట, మార్చి27: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువు వచ్చిందని, ప్రభుత్వం స్పందించి ప్రాజెక్టు గేట్లు తెరిచి పంటలకు సాగునీరు అందించాలని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మెదక్ జిల్లా నార్సింగి మండల పరిధిలోని నర్సంపల్లి పెద్దతండాలో ఆయన పర్యటించి ఎండిపోయిన పంటలను బుధవారం పరిశీలించారు. పంటలు పూర్తిగా ఎండిపోయి పశువులకు మేతగా మారడంతో పలువురు రైతులు ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డితో కంట తడిపెట్టగా ఓదార్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వంతోనే కరువొచ్చిందని, ఎండిన పంట పొలాలను వ్యవసాయ శాఖ అధికారులతో పంట నష్టాన్ని అంచనా వేయించి, ప్రభుత్వం పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత కరెంటు కూడా సక్రమంగా రావటం లేదని, ఇప్పటికైనా నీళ్లు విడిచి పంటలను కాపాడాలన్నారు. ఎండిపోయిన పంటకు రూ. 20వేల వరకు పరిహారం చెల్లించాలన్నారు. రైతులు పంటలు ఎండిపోయి నానా ఇబ్బందులు పడుతుంటే కాంగ్రెస్ నాయకులు హైదరాబాద్‌లో కూర్చొని ఏవేవో మాట్లాడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మల్లన్న సాగర్, కొండ పోచమ్మ సాగర్‌ల నుంచి నీళ్లను విడుదల చేసి వాగులు, చెరువులు, కుంటలు నింపితే భూగర్భ జలాలు పెరుగుతాయని అన్నారు. కార్యక్రమంలో నర్సంపల్లి పెద్ద తండా మాజీ సర్పంచ్ చత్రీయనాయక్, నార్సింగి, చేగుంట జడ్పీటీసీలు బాణపురం కృష్ణారెడ్డి, ముదాం శ్రీనివాస్, మాజీ వైస్‌ఎంపీపీ మల్లేశం గౌడ్, చేగుంట మాజీ సర్పంచ్ శ్రీనివాస్, నాయకుడు భాషతో పాటు పలువురు గిరిజన రైతులు పాల్గొన్నారు.



ఎండిన వరిపొలాన్ని చూసి ఆవేదన వ్యక్తం చేస్తున్న రైతు

## మహిళకు ఇచ్చే గౌరవం ఇదేనా?

సిద్దిపేట అర్బన్, మార్చి 27: కనీసం సీటు ఇవ్వకుండా అవమానించారని సిద్దిపేట జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి కంటతడి పెట్టారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో బుధవారం బీసీ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియా సమావేశం నిర్వహించారు. సమావేశంలో మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, ఇతర కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. సమావేశానికి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ముద్దం లక్ష్మి రాగా కనీసం కుర్చీ వేయకపోవడంతో మీడియా సమావేశం ముగిసే వరకు నిలబడి ఉన్నారు. ప్రెస్‌మీట్ అనంతరం లక్ష్మి మాట్లాడుతూ మహిళా అధ్యక్షురాలినైన తనను మీడియా సమావేశానికి పిలిచి అవమానించడం బాధాకరమన్నారు. పదేండ్లుగా కాంగ్రెస్ పార్టీకి ఎంతో సేవ చేశానన్నారు. కనీసం సీటు కూడా ఇవ్వకుండా అవమానించారని ఆవేదన వ్యక్తం చేశారు. మంత్రి నిర్వహించిన మీడియా సమావేశంలో ఒక మహిళను గౌరవించడం ఇదేనా అని ఆమె ప్రశ్నించారు.



మీడియా సమావేశంలో నిలబడిన మహిళా కాంగ్రెస్ సిద్దిపేట జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి

## కేంద్రంతో సత్సంబంధాలు నెలకొల్పుతాం

- బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్



మాట్లాడుతున్న మంత్రి పొన్నం ప్రభాకర్

సిద్దిపేట అర్బన్, మార్చి 27: ప్రజా సమస్యలు పరిష్కరించేందుకు కేంద్రంతో సత్సంబంధాలు నెలకొల్పుతామని బీసీ సంక్షేమ, రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. సిద్దిపేటలోని కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ పదేండ్లలో ఈసారి మాత్రమే తక్కువ వర్షపాతం నమోదైందని, కరువుకు కాంగ్రెస్ పార్టీ కానీ, బీఆర్ఎస్ పార్టీ కానీ కారణం కాదన్నారు. దానిని రాజకీయం చేయడం దురదృష్టకరమన్నారు. ఎల్‌నినో ప్రభావం వల్ల 2022 కంటే 2023లో తక్కువ వర్షపాతం నమోదైందని, మాజీ మంత్రి హరీశ్‌రావు వాస్తవాలకు విరుద్ధంగా మాట్లాడటం మంచిది కాదన్నారు. త్వరలో ఐదు ఎకరాల్లోపు ఉన్న వారందరికీ రైతుబంధు అందజేస్తామన్నారు. రైతుల కోసం గతంలో కాంగ్రెస్ పార్టీ చారిత్రాత్మక నిర్ణయాలు తీసుకుందన్నారు. పంట బీమా లేక రైతులు నష్టపోతున్నారని.. ఆ దిశగా చర్యలు చేపట్టామన్నారు. తాగునీటికి సమస్యలు రాకుండా ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ, డీసీసీ ప్రెసిడెంట్ నర్సారెడ్డి, పాల్గొన్నారు.

## భక్తజన పాలకుడు..నాచగిరి లక్ష్మీనారసింహుడు

### రేపటి నుంచి బ్రహ్మోత్సవాలు, 31న తిరుకల్యాణం

- ఏప్రిల్ 4న గరుడోత్సవం, 8న విమాన రథోత్సవం
- ఏర్పాట్లు పూర్తి చేసిన ఆలయ అధికారులు



కొలువుదీరిన దేవతామూర్తులు



నాచగిరి నృసింహస్వామి క్షేత్రం

వర్గల్, మార్చి 27: భక్తజన పాలకుడు..నాచగిరి క్షేత్ర లక్ష్మీనారసింహస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు సర్వం ముస్తాబైంది. పవిత్ర హరిద్రా నదీతీరమున శ్వేతగిరి కొండపై లక్ష్మీసమేతంగా కొలువై కోరి వచ్చిన భక్తుల కోరికలు తీర్చుతూ అశేష భక్తజన హితుడిగా, సర్వకాలమున సర్వావస్థలో సంరక్షించే నారసింహస్వామిగా పేర్గాంచింది నాచగిరి నృసింహ క్షేత్రం. భాగ్యనగరానికి 55కి.మీ దూరంలోని సిద్దిపేట జిల్లా వర్గల్ మండలం నాచారం సమీపంలో కొండగుహల్లో సుమారు 5వేల ఏండ్ల నుంచి దేదీప్యమానంగా పూజింపబడుతున్న మృగ నారసింహుడిని దర్శించుకునేందుకు రాష్ట్రం నుంచే కాకుండా పక్క రాష్ట్రాల నుంచి కూడా భక్తులు బ్రహ్మోత్సవాల సందర్భంగా భారీగా తరలివస్తుంటారు. శుక్రవారం నుంచి వారం రోజుల పాటు నిర్వహించనున్న బ్రహ్మోత్సవాలకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు పూర్తి చేశారు.

**ఒక్కో వాహనంపై స్వామివారి దర్శనం**

బ్రహ్మోత్సవాల్లో లక్ష్మి సమేత నరసింహస్వామిని దర్శించుకుంటే శత్రుబాధ, భూత, ప్రేత పిశాచర బాధితుల నుంచి విముక్తి కలుగుతుందని ఆర్యోక్తి. భక్తులు నిత్య మంగళధాయకుడైన లక్ష్మీనరసింహస్వామికి అర్చనలు, అభిషేకాలు, కల్యాణాలు నిర్వహిస్తుంచారు. దేవతామూర్తుల లగ్నం తర్వాత రోజుకో వాహన సేవపై ప్రతిరోజూ శ్వేతగిరి పురవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిస్తాడు.

**అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం**




స్వామివారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ముఖ్యంగా తాగునీరు, కరెంట్, వాహనాల పార్కింగ్‌ల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చర్యలు చేపట్టాం. స్వామివారి రోజువారీ సేవలతో పాటు చండీ హోమం, నిత్య కల్యాణాలు, హోమాధి పూజల్లో పాల్గొనే భక్తులకు ప్రత్యేక రసీదులు ఇచ్చేందుకు కౌంటర్లు ఏర్పాటు చేశాం. నూటొక్క సత్రాల్లో, దాతలు నిర్మించిన సత్రాల్లో ఇబ్బందులు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేస్తున్నాం.

– అన్నపూర్ణ, కార్యనిర్వహణాధికారి, నాచారం గుట్ట

## సినిమా, సీరియల్స్‌లో మహిళలదే అగ్రస్థానం

- రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాజిదాఖాన్
- సుల్తాన్‌పూర్ జేఎన్టీయూలో ఘనంగా మహిళా దినోత్సవం



జ్యోతి వెలిగిస్తున్న రాష్ట్రపతి అవార్డు గ్రహీత సాజిదాఖాన్

చౌటకూర్, మార్చి 27: సినిమాలు, సీరియల్స్‌లో మహిళలదే అగ్రస్థానమని, భవిష్యత్తులో మరింతగా ఎదగాల్సిన అవసరం ఉన్నదని రాష్ట్రపతి అవార్డు గ్రహీత డాక్టర్ సాజిదాఖాన్ అన్నారు. మండలంలోని సుల్తాన్‌పూర్ జేఎన్టీయూ ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం ప్రపంచ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆమె కళాశాలలోని సెమినార్ హాలులో జ్యోతి వెలిగించి వేడుకలను ప్రారంభించి మాట్లాడారు. సమాజంలో మహిళలు వివిధ రంగాల్లో ప్రావీణ్యం పొందుతూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఇది శుభపరిణామమన్నారు. రంగస్థలం మొదలుకొని సినిమా, సీరియళ్లు, న్యూస్ రీడర్స్, ఇతర రంగాల్లో మహిళలదే అగ్రస్థానమని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మహిళల కోసం అనేక చట్టాలు రూపొందిస్తున్నాయన్నారు. దీంతో మహిళలకు ఆయా రంగాల్లో అనేక అవకాశాలు దక్కుతున్నాయన్నారు. రాజకీయాల్లో కూడా ప్రత్యేక గుర్తింపు తెచ్చుకోవడం అభినందనీయమన్నారు. తాను కూడా అట్టడుగు స్థాయి నుంచి ఎదిగానని, అంచెలంచెలుగా ఎదుగుతూ రాష్ట్రపతి అవార్డుకు ఎంపికయ్యానన్నారు. ఏ పనినైనా ఇష్టంగా చేస్తే ఎన్నో ప్రయోజనాలుంటాయన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డాక్టర్ సునీతారెడ్డి మాట్లాడుతూ మహిళలు తలచుకుంటే కాని పని ఉండదని, కావాల్సిందల్లా చిత్తశుద్ధి, పనిపై ఏకాగ్రత అన్నారు. అనుకున్న లక్ష్యాలను సాధించేందుకు అవసరమైన మెళకువలను విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ నర్సింహ, వైస్ ప్రిన్సిపాల్ రాఘవేందర్‌రావు, వివిధ విభాగాధిపతులు ప్రసన్న లక్ష్మి, సునీత, మహిళా సిబ్బంది పాల్గొన్నారు.

## పెండ్లింట విషాదం

### వధువును తీసుకెళ్లేందుకు వస్తూ ట్రాక్టర్ బోల్తా

- ముగ్గురు మృత్యువాత, 26మందికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం
- దవాఖాన వద్ద మిన్నంటిన బంధువుల రోదనలు
- సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం మన్నాన్‌పల్లి శివారులో ఘటన


అందోల్, మార్చి 27: తెల్లారితే పెండ్లి భాజాలతో మార్మోగాల్సిన ఇంట్లో తీవ్ర విషాదం నెలకొన్నది. బంధువులతో కలిసి ట్రాక్టర్‌లో పెండ్లి కూతురును తీసుకొచ్చేందుకు ఆనందంగా బయలుదేరినవారు మరికొద్దిసేపట్లో పెండ్లి కూతురు ఇంటికి చేరుకుంటామనేలోగా ట్రాక్టర్ బోల్తాపడడంతో ముగ్గురు మృతి చెందారు. మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉండి, 27మంది క్షతగాత్రులయ్యారు. ప్రమాదానికి సంబంధించి జోగిపేట ఎస్సైఅరుణ్‌కుమార్‌గౌడ్ తెలిపిన కథనం ప్రకారం.. మెదక్ జిల్లా పాపన్నపేట మండలం బాచారం గ్రామానికి చెందిన యువకుడికి అందోల్‌కు చెందిన యువతితో గురువారం పెండ్లి నిశ్చయించగా బంధువులు పెండ్లి కూతురును తీసుకొచ్చేందుకు బుధవారం ట్రాక్టర్‌లో బాచారం నుంచి అందోల్‌కు బయలుదేరారు. వారు ప్రయాణిస్తున్న ట్రాక్టర్ మండలంలోని మన్నాన్‌పల్లి శివారులోకి రాగానే మూల మలుపు వద్ద బోల్తాపడింది. దీంతో అందులో ప్రయాణిస్తున్న బాచారానికి చెందిన సంగమ్మ (45) బుధేమ్మ( 52), ఆగమ్మ (42) ఘటనా స్థలంలోనే మృతి చెందారు. మరో 26 మందికి తీవ్రగాయాలు కాగా వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది. స్వల్పంగా గాయపడిన వారిని జోగిపేట ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తుండగా... తీవ్రగాయాలైన వారిని సంగారెడ్డి, హైదరాబాద్ దవాఖానలకు తరలించారు. ట్రాక్టర్‌ను డ్రైవర్ అతివేగంగా నడపడంతోనే ఈ ప్రమాదం జరిగినట్లు ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. మూలమలుపు ఉండడం, మితిమీరిన వేగం కారణంగా ట్రాక్టర్ బోల్తాపడింది. ప్రమాద స్థలంతోపాటు జోగిపేట ప్రభుత్వ దవాఖాన వద్ద బంధువుల రోదనలు మిన్నంటాయి. తీవ్రంగా గాయపడన వారిలో మూడేండ్ల చిన్నారి కూడా ఉడడంతో వారి తల్లిదండ్రుల రోదనలు అందరినీ కంటతడి పెట్టించాయి. ప్రమాద స్థలాన్ని సీఐ చెంద్రయ్య పరిశీలించి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకున్నారు. మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.



జోగిపేట దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు



మన్నాన్‌పల్లి వద్ద బోల్తాపడిన ట్రాక్టర్, ఘటనా స్థలంలో క్షతగ్రాతులు



జోగిపేట దవాఖానలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులు




## ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, మార్చి 27: రాష్ట్ర మైనార్టీస్ స్టడీ సర్కిల్, మైనార్టీల సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో యూపీఎస్సీ–సీశాట్ 2025 పరీక్ష కోసం 2024–25 విద్యా సంవత్సరంలో వంద మంది మైనార్టీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్ నిర్వహిస్తామని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి జెమ్లానాయక్ బుధవారం ప్రకటనలో తెలిపారు. శిక్షణకు రిజర్వేషన్ల ప్రకారం మహిళా అభ్యర్థులకు 33.33శాతం సీట్లు, దివ్యాంగులకు 5శాతం సీట్లు కేటాయించామన్నారు. హైదరాబాద్ మైనార్టీ స్టడీసర్కిల్‌లో మొదటిసారి ప్రవేశం పొందే అభ్యర్థులు మాత్రమే ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థుల కుటుంబ ఆదాయం సంవత్సరానికి రూ.5 లక్షలలోపు ఉండాలన్నారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాలోని డిగ్రీ పూర్తి చేసిన మైనార్టీ అభ్యర్థులు ఏప్రిల్ 12వ తేదీ లోగా http://tmreistelangana.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఏప్రిల్ 28న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఇతర వివరాల కోసం 040–23236112 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.